తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి

సోమవారం
23 నవంబర్ 2026

పేజీలు : 8

Follow :

కార్తీకం వేళ 'కూరగాయల' మంట..

సామాన్యుడి నడ్డి విరుస్తున్న ధరలు..
చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం!





మణుగూరు, నవంబర్ (జనంసాక్షి):
పవిత్రమైన కార్తీక మాసంలో భక్తి పారవశ్యంలో మునిగితేలాల్సిన సామాన్య ప్రజలకు కూరగాయల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. నిన్నటి వరకు సామాన్యుడికి అందుబాటులో ఉన్న కాయగూరలు, నేడు సామాన్యుడు కన్నెత్తి కూడా చూడలేని విధంగా ఆకాశాన్నంటాయి. మార్కెట్‌కు వెళ్తే రూ. 500 నోటు కనీసం సంచి కూడా నింపలేని దుస్థితి నెలకొనడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు బెంబేలెత్తిపోతున్నాయి. కట్ట రూ .20,కొత్తిమీర రూ . కట్ట రూ 50 చెబుతున్నారు. ధరలు ఆకాశాన్నంటుతుంటే ఆకు కూరలు తినే పరిస్థితి లేకుండా పోయింది.. కార్తీక మాసంలో భోజనం కంటే ఉపవాసం మేలు అంటున్న ప్రజలు...

మాంసాహారానికి దూరం.. కూరగాయల ధరల భారం!
కార్తీక మాసం కావడంతో మెజారిటీ ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉంటూ పూర్తిగా శాకాహారానికే పరిమితమవుతున్నారు. దీనికి తోడు వనభోజనాలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు, అయ్యప్ప స్వామి మాల వేసుకోవడంతో మార్కెట్లో కూరగాయలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా భావించిన దళారులు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలను అమాంతం పెంచేశారు. ఫలితంగా నిన్న మొన్నటి వరకు కిలో రూ. 30 నుండి రూ. 40 పలికిన కూరగాయలు, నేడు ఏకంగా రూ. 80 నుండి రూ. 120 పైనే పలుకుతూ వినియోగ దారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి.కిలో కాదు.. పావు కిలోతోనే సరి టమాటా, వంకాయ, బెండకాయ, దొండకాయ, క్యారెట్, బీన్స్ ఇలా ఏ కూరగాయ ముట్టుకున్నా మంట పుట్టిస్తోంది. సామాన్య కూలీలు, చిరుద్యోగులు కిలోల కొద్దీ కూరగాయలు కొనే పరిస్థితి లేక, కేవలం పావు కిలో, అర కిలోతోనే సరిపెట్టుకుంటూ కాలం వెళ్ల దీస్తున్నారు.అధిక ధరలతో సామాన్యుడికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.ములక్కాయ 3రూ.50, సొరకాయ రూ.50,ఉల్లిపాయలు కిలో రూ .70 ,పచ్చిమిర్చి కిలో రూ.120 ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం?
పంట దిగుబడి తగ్గిందని, రవాణా ఖర్చులు పెరిగాయని వ్యాపారులు చెబుతున్న సాకులు కేవలం దోపిడీకి నిదర్శనమని వినియోగదారులు మండిపడుతున్నారు. రైతు వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు, బహిరంగ మార్కెట్లో మాత్రం మూడు నాలుగు రెట్లు అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు, విజిలెన్స్ యంత్రాంగం, వ్యవసాయ శాఖ అధికారులు కనీసం తనిఖీలు నిర్వహించకపోవడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనికి తోడు తూనికలు కొలతల్లో మాయాజాలం చూపించి అమాయక ప్రజలను దోచుకుంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గ్రామ సంతల్లో రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే కూరగాయలను అందుబాటులోకి తీసుకురావాలని, ధరలను కృత్రిమంగా పెంచుతున్న దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాన్యులు డిమాండ్ చేస్తున్నారు.



ముదిరాజ్ లకు అండగా
కాంగ్రెస్ ప్రభుత్వం
కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి

అనంతగిరి,నవంబర్ 22 జనంసాక్షి :
అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజన కార్యక్రమంలో కోదాడ శాసనసభ్యురాలు నలమాద పద్మావతి రెడ్డి గారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ ప్రజలతో కలిసి వనభోజన కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. కార్తీక మాస వనభోజనాలు సంప్రదాయాలు, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతకు, పరస్పర స్నేహసంబంధాలకు ప్రతీకలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

సూరారం గ్రామ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కూనంనేనికి
వినతిపత్రం

వార్తా లోపలి పేజీలో

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాల ఆరోపణలు!

- అర్హుల ఆశలపై వసూళ్ల నీడ.. రూ.50 వేలిస్తేనే ఇల్లు మంజూరా
- ఏన్కూరు మండలంలోని గ్రామ పంచాయతీల్లోనే అక్రమాలపై చర్చ..
- కమిటీల పేరుతో డబ్బుల డిమాండ్ చేస్తున్నారంటూ బాధితుల ఆవేదన
- అర్హులకు మొండిచేయి.. అనర్హులకు ఇళ్ల మంజూరు

ఏన్కూర్, (జనంసాక్షి) :
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఏన్కూరు మండలంలోని గ్రామ పంచాయతీల్లో వివాదాస్పదంగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం క్షేత్రస్థాయిలో పారదర్శకతకు దూరమవుతోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.50 వేలు ఇస్తేనే ఇల్లు వస్తుందా?
ఇందిరమ్మ కమిటీల పేరుతో

మిగతా 2లో



ఆగ్రిగోల్డ్ బాధితులకు పోలీసుల భరోసా

- ఆగ్రిగోల్డ్ బాధితులకు కీలక ప్రకటన
- ఈ నెల 25 నుంచి బాండ్ల ధృవీకరణ
- కొత్తగూడెంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు
- మండలాల వారీగా తేదీల కేటాయింపు
- బూర్గంపహాడ్ బాధితులకు డిసెంబర్ 18 నుంచి అవకాశం
- అసలు బాండ్లు చూపించాలి..
- జిరాక్స్ కాపీలు సమర్పించాలి : ఎస్పీ రోహిత్ రాజు

బూర్గంపహాడ్ నవంబర్ 22 (జనంసాక్షి)
ఆగ్రిగోల్డ్‌లో పెట్టుబడులు పెట్టి ఏళ్లుగా తమ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న బాధితులకు సంబంధించి బాండ్ల ధృవీకరణ, వివరాల నమోదు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పరిధిలోని డిపాజిటర్లు, బాధితులు, ఏజెంట్ల సౌకర్యార్థం ఈ నెల 25వ తేదీ నుంచి కొత్తగూడెంలో ప్రత్యేక ధృవీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా పోలీసులు ప్రకటించారు. హేమచంద్రపురంలోని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ వెల్లడించారు. బాధితులు తమ వద్ద ఉన్న అసలు ఆగ్రిగోల్డ్ బాండ్లు, నగదు రసీదులను ధృవీకరణ కోసం చూపించి, వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

మండలాల వారీగా తేదీల కేటాయింపు..



బాధితులు ఒకేసారి కేంద్రానికి చేరుకుని ఇబ్బందులు పడకుండా మండలాల వారీగా ధృవీకరణ తేదీలను కేటాయించారు. నవంబర్ 25 నుంచి 2027 ఏప్రిల్ 9వ తేదీ వరకు విడతలవారీగా

మిగతా 2లో

జనంసాక్షి

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాల ఆరోపణలు!

కొందరు రూ.50 వేల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చ నీయాంశంగా మారాయి. డబ్బులు ఇవ్వగలిగిన వారికే ప్రాధాన్యత లభిస్తోందని, నిజమైన నిరుపేదలు మాత్రం అర్హత ఉన్నప్పటికీ జాబితాల్లో చోటు దక్కించుకోలేకపోతున్నారని బాధితులు వాపోతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను గుర్తించి, పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయినప్పటికీ కొన్ని పంచాయతీల్లో ఎంపిక ప్రక్రియపై వస్తున్న ఫిర్యాదులు, వసూళ్ల ఆరోపణలు అధికారుల పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గ్రామస్థాయిలో కమిటీల పనితీరును పరిశీలించాల్సిన అధికారులు ఏమేరకు తనిఖీలు చేస్తున్నారు? లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, పేదల సంక్షేమానికి సంబంధించిన కీలకమైన పథకంలో ఇలాంటి ఆరోపణలు వస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమగ్రంగా స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

బాధితుల ఫిర్యాదులను పట్టించుకోకుండా వ్యవహరిస్తే ప్రభుత్వ పథకం అసలు లక్ష్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఏన్కూరు మండలం లోని ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితాలను బహిర్గతం చేయాలని, దరఖాస్తులు, క్షేత్రస్థాయి పరిశీలన నివేదికలు, ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వం పేదల కోసం ఇచ్చిన ఇల్లు.. మధ్యలో అక్రమ వసూళ్లకు వేదిక కాకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆగ్రిగోల్డ్ బాధితులకు పోలీసుల భరోసా



ఈ ప్రక్రియ కొనసాగనుంది. రోజుకు గరిష్ఠంగా 250 మంది ఖాతాదారుల పత్రాలను మాత్రమే పరిశీలిస్తారు. ప్రతి పని దినం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధృవీకరణ జరుగుతుంది. కాబట్టి బాధితులు తమ మండలానికి కేటాయించిన తేదీని గమనించి అదే రోజు హాజరుకావాలి.

అసలు బాండ్లు అప్పగించొద్దు..

ధృవీకరణకు వచ్చే వారు అసలు బాండ్లు లేదా నగదు రసీదులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, అయితే వాటిని అధికారులకు అప్పగించాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు. పరిశీలన కోసం మాత్రమే అసలు బాండ్లను చూపించి, వాటి కలర్ జిరాక్స్ కాపీలను సమర్పించాలి. ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, మొబైల్ నంబర్ వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలి. డిపాజిటర్ మరణించిన సందర్భాల్లో నామినీ, డిపాజిటర్ మరియు నామినీ ఇద్దరూ మరణించిన సందర్భాల్లో చట్టబద్ధ వారసులు సంబంధిత మరణ ధృవీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులతో హాజరుకావాలి. డిపాజిటర్ స్వయంగా రాలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు అధికార పత్రంతో పాటు సంబంధాన్ని నిరూపించే ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. ఏజెంట్లు కూడా తమ వద్ద ఉన్న బాండ్ల వివరాలు, ఏజెంట్ కోడ్, గుర్తింపు, బ్యాంకు వివరాలను అందించాలి.

- బూర్గంపహాడ్ బాధితులు డిసెంబర్ 18 నుంచి హాజరుకావాలి.

బూర్గంపహాడ్ మండలానికి చెందిన ఆగ్రిగోల్డ్ బాధితులకు డిసెంబర్ 18వ తేదీ నుంచి ధృవీకరణకు అవకాశం కల్పించారు. డిసెంబర్ 18న 245 మందికి, 19, 21, 22, 23, 24 తేదీల్లో రోజుకు 250 మందికి చొప్పున, డిసెంబర్ 28న మరో 196 మందికి అవకాశం కల్పించారు. భద్రాచలం మండల బాధితులకు డిసెంబర్ 5వ తేదీ నుంచి విడతలవారీగా తేదీలు కేటాయించారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా కేంద్రం ఇన్‌చార్జి ఎ. రామకాంత్‌ను 8712682128 నంబర్‌లో లేదా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని పోలీసులు తెలిపారు. ఆగ్రిగోల్డ్ బాధితులు తమకు కేటాయించిన తేదీలను ముందుగానే పరిశీలించుకుని, అవసరమైన అన్ని పత్రాలతో ధృవీకరణ కేంద్రానికి హాజరై నమోదు ప్రక్రియను సజావుగా పూర్తి చేసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు.

సూరారం గ్రామ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కూనంనేనికి వినతిపత్రం

కొత్తగూడెం క్రైమ్,నవంబర్ 22, (జనంసాక్షి):

కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావును పాల్వంచ రూరల్ మండలం పాత సూరారం గ్రామానికి చెందిన గ్రామస్తులు యువజన నాయకుడు మెస్సు ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సూరారం గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి,మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గ్రామ సమస్యలను పరిశీలించి,పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.





దోసపాటి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ

కల్లూరు నవంబర్ 22(జనం సాక్షి)

కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు దోసపాటి శ్రీనివాసరావు జన్మదినాన్ని పురస్కరించుకుని స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలోవిద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పెన్నులను పంపిణీ చేశారు.తన వంతు సామాజిక బాధ్యతగా ఆయన ఈ విద్యా సామగ్రిని అందించడం పట్ల స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పేద విద్యార్థుల చదువుకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందని, దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నరసింహారావు, తిరుపతిరావు, ఉపేందర్ ప్రవీణ్ స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు,పాల్గొన్నారు.

అటవీ పరిరక్షణలో శ్రీనివాసరావు త్యాగం చిరస్మరణీయం

అటవీ పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన చి. శ్రీనివాసరావుకు ఘన నివాళులు

జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్

స్మృతివనంలో నాలుగో వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 23 (జనంసాక్షి):



అటవీ సంపద, మొక్కల పెంపకాన్ని పరిరక్షించే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన దివంగత అటవీ అధికారి చి. శ్రీనివాసరావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆదివారం చంద్రుగొండ అటవీ రేంజ్ పరిధిలోని స్మృతివనంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. 2022 నవంబర్ 22న ఇదే ప్రాంతంలో అటవీ ప్లాంటేషన్‌ను పరిరక్షించే క్రమంలో శ్రీనివాసరావుపై దాడి జరిగి ఆయన ప్రాణాలు కోల్పోయారని జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ గుర్తు చేశారు. అటవీ పరిరక్షణ కోసం ఆయన చేసిన ప్రాణత్యాగం, విధి పట్ల చూపిన అంకితభావం అటవీ శాఖ సిబ్బందికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీనివాసరావు పనిచేసిన అటవీ ప్రాంతాల్లో నేటికీ అధికారులు, సిబ్బంది అదే బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారని, ఆయన పరిరక్షణకు కృషి చేసిన అటవీ ప్రాంతాలు, మొక్కలను కాపాడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అటవీ ప్రాంతాలకు ముప్పు వాటిల్లినప్పుడు తక్షణమే స్పందించడం, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి అండగా నిలవడం, అటవీ పరిసర గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ అటవీ సంపదను సంరక్షించడం ద్వారా ఆయన త్యాగానికి నిజమైన నివాళి అర్పించగలమన్నారు.భవిష్యత్ తరాలకు పచ్చని అడవులను అందించడమే శ్రీనివాసరావుకు అందించే అత్యుత్తమ నివాళి అని జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో స్మృతివనాన్ని సందర్శించే యువ అధికారులు, విద్యార్థులు పచ్చని అడవులను చూసి ఆయన చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకునేలా అటవీ సంరక్షణకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మార్పు కోసం ముందడుగు-సమాజసేవే ఇస్లాం లక్ష్యం

పి ఎం ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రదర్ సిరాజ్ ఉర్ ఉర్రెహమాన్

కల్లూరు నవంబర్ 22(జనంసాక్షి)



సామాజిక సేవ లక్ష్యంగా మార్పు కోసం ఇస్లాం ముందడుగు వేస్తుందని పీస్ మెసేజ్ ఫౌండేషన్ (పి ఎం ఎఫ్)రాష్ట్ర అధ్యక్షులు బ్రదర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్ స్పష్టం చేశారు. కల్లూరు లోని జామే మసీదు ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన గొప్ప బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తోటి మానవుల పట్ల జాలి దయతో పాటు, కరుణ చూపాలని పేర్కొన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ యుగంలో కూడా పలు సమాజాల్లో వివక్షతలు కొనసాగటం పట్ల సిరాజ్‌ఉర్ రెహమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్నం లేక ఆకలితో ఎవరు చనిపోకూడదని అన్నారు.కానీ నేటి ఈ సమాజంలో అలాంటి పరిస్థితులు పలుచోట్ల ఉన్నాయన్నారు. మానవులంతా ఒకటేనని కుల మతాలతో సంబంధం లేకుండా మానవత్వంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి సౌఖ్యం ఉంటాయన్నారు.

ముస్లింలకు ఉద్యోగాలుపవి

మన దేశంలో 30 కోట్ల మంది ముస్లింలు జీవిస్తున్నప్పటికీ అఖిలభారత సర్వీస్ ఉద్యోగాల్లో ఉద్యోగుల శాతం చాలా తక్కువగా ఉన్నదని బ్రదర్ సిరాజ్ రెహమాన్ పేర్కొన్నారు. ఐఏఎస్ లో కేవలం 3%,ఐపీఎస్ లో 4%, ఐ ఎఫ్ ఎస్ లో 1.8%, జడ్జిల్లో ఒక్కరు కూడా లేరని ఆయన తెలిపారు. ముస్లింలు అన్ని రంగాలతో పాటు చదువులో కూడా ముందుండాలని ఆయన సూచించారు. దైవారాధన తో పాటు సంక్షేమ కార్యక్రమాలు, సత్కార్యాలు చేయాలని ముస్లిం సోదరులను కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుండి వచ్చిన జనాబ్ లతీఫ్ సాహెబ్, అబ్దుల్ జబ్బార్ బేగ్, హబీబ్ సాహెబ్, హాజరయ్యారు. కార్యక్రమ నిర్వాహకులు ఎండి హనీఫ్, సయ్యద్ అలీ, అమీరుద్దీన్, సయ్యద్ ఇషాక్, ఎస్కే మహబూబ్, ఎండి ఆసిఫ్, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వైరా, ఏనుకూరు, మండలాల నుండి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

అక్రమ ఖనిజ రవాణాపై మైనింగ్ శాఖ కొరడా

నాలుగు లారీలు పట్టివేత!

అనుమతులు లేకుండా మెటల్ తరలింపు..

రూ.57,337 జరిమానా..

భద్రాచలం నవంబర్ 22 (జనంసాక్షి)

రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ ఖనిజ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మైనింగ్ శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భద్రాచలం ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, సరైన అనుమతి పత్రాలు లేకుండా మెటల్ తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకున్నారు. అక్రమ ఖనిజ రవాణాపై నిఘా పెంచిన అధికారులు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, అనుమతులు లేకుండా మెటల్ తరలిస్తున్నట్లు గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి నాలుగు లారీలకు కలిపి మొత్తం రూ.57,337 జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ దినేష్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఖనిజాలను రవాణా చేసినా, అక్రమ మైనింగ్‌కు పాల్పడినా ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ ఖనిజ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు నిరంతర తనిఖీలు, నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో మైనింగ్ ఆర్ఐ పరుశురాం, టీజీఎండీసీ సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు భద్రాచలంలో
బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

- ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు

భద్రాచలం నవంబర్ 22 (జనంసాక్షి)

దీక్షా దివస్ సందర్భంగా ఈ నెల 29న భద్రాచలం డివిజన్ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానే రామకృష్ణ వెల్లడించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని వారు కోరారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దీక్షా దివస్ ప్రాధాన్యతను చాటిచెప్పేలా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా, సమన్వయంతో వ్యవహరించి సభను విజయవంతం చేయాలని రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

ఏజెన్సీలో జీఎంఎస్ నెం.25ను
తక్షణమే రద్దు చేయాలి

○ ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలి

○ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు డిమాండ్

భద్రాచలం నవంబర్ 22 (జనంసాక్షి)

ఏజెన్సీ ప్రాంతంలో అమలవుతున్న జీఎంఎస్ నెం.25ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు డిమాండ్ చేశారు. ఏజెన్సీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం భద్రాచలం రాజుపేట కాలనీలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జయబాబు మాట్లాడుతూ తెలంగాణలో ఆదివాసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే విధంగా ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని కోరారు. ఆదివాసీల హక్కులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. జీఎంఎస్ నెం.25 రద్దు, ఆదివాసీలకు ప్రత్యేక రిజర్వేషన్ల సాధన కోసం ఏటీఏ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, రాష్ట్ర కోశాధికారి సోయం హనుమంతరావు, ఎంఈఓలు సున్నం సమ్మయ్య, కొడెం పద్మతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సమయానికి హాజరుకావాలి

○ ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలి

○ ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ

భద్రాచలం నవంబర్ 22 (జనంసాక్షి)



గిరిజనులు, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ సోమవారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు ఆదివారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. ఆయా కార్యక్రమాలకు ఐటీడీఏ పరిధిలోని అన్ని శాఖల యూనిట్ అధికారులు, డివిజన్ అధికారులు విధిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలకు సంబంధించిన వివరాలను లిఖితపూర్వకంగా అందజేయాలని సూచించారు. ప్రజలు సమర్పించిన అర్జీలపై తక్షణ స్పందనతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.సోమవారం ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరాల్లో ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గిరిజనులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించాలని పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ కోరారు.

స్వతంత్ర సమరయోధుడు, రైతు యన్నం వెంకట్రావుకు ఘన నివాళి

మధిర, నవంబర్ 22 (జనంసాక్షి):



మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడుకు చెందిన దివంగత స్వతంత్ర సమరయోధుడు, రైతు యన్నం వెంకట్రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం హాజరై, వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, దివంగత యన్నం వెంకట్రావు స్వతంత్ర సమరయోధుడిగా, రైతుగా నిరాడంబర జీవితం గడిపారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.స్వాతంత్ర్యం అనంతరం కూడా సాధారణ రైతుగా తాను పండించిన పంటను ప్రభుత్వానికి అందిస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో తన వంతు భాగస్వామిగా నిలిచేవారని తెలిపారు.శ్రమను నమ్ముకుని, నిజాయితీతో బతికిన ఆయన జీవనశైలి నేటి తరం రైతాంగానికి, యువతకు ఆదర్శమని చెప్పారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా కుమారుడు యన్నం కోటేశ్వరరావు కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కోటేశ్వరరావు చూపుతున్న చొరవను ప్రశంసించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు, దోర్నాల వెంకట రవి, కౌన్సిలర్ బెజ్జం రాజు తదితరులు పాల్గొన్నారు.



25వ పెళ్లిరోజు వేడుకలు

పోట్ల వాసుదేవరావు నీలిమ దంపతులకు శుభాకాంక్షల వెల్లువ

తిరుమలాయపాలెం, నవంబర్ 22 (జనంసాక్షి) :

తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు పోట్ల వాసుదేవరావు?నీలిమ దంపతులు 25 సంవత్సరాల వైవాహిక జీవితాన్ని పూర్తి చేసుకొని 26వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, శ్రేయోభిలాషులు వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషా లతో, కుటుంబ సభ్యులతో కలిసి అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.ఈ కార్యక్రమం లో తిరుమలాయ పాలెం బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న, జల్లేపల్లి మాజీ సర్పంచ్ భాషబోయిన శైలజ, బీఆర్ఎస్ మండల నాయకులు పోట్ల జగదీష్, జల్లేపల్లి మాజీ ఎంపీటీసీ బోడా మంచా నాయక్, సీనియర్ నాయకులు కనుమల్లపూడి శ్రీనివాస్, మట్టా హనుమంతరావు, ఈడబోయిన సైదులు, పోట్ల నాగేశ్వరరావు, నవీన్, శంకరబోయిన ఎల్లయ్య, గొల్లపూడి సాయి తదితరులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.

గుర్రాల చెరువు శివారులో
జూద స్థావరంపై పోలీసుల దాడి

ఆరుగురు జూదరుల అరెస్ట్ - రూ.45,820 నగదు,రెండు సెల్‌ఫోన్లు

స్వాధీనం- మరో నలుగురు పరారీ.. కేసు నమోదు చేసి దర్యాప్తు..

అశ్వారావుపేట నవంబర్ 22(జనంసాక్షి):

శ్వారావుపేట మండలం గుర్రాల చెరువు గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు దాడి చేశారు.ఈరోజు సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు అశ్వారావుపేట అదనపు ఎస్ఐ దేవ్ సింగ్,పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి జూద స్థావరంపై ఆకస్మికంగా దాడి నిర్వహించారు.ఈ దాడిలో చిత్తు బొత్తు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.45,820 నగదు,రెండు సెల్‌ఫోన్లు,రెండు రూపాయి కాయిన్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల దాడి సమయంలో మరో నలుగురు వ్యక్తులు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.జూద కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అశ్వారావుపేట మండల ప్రజలు ఎవరైనా జూద స్థావరాలు నిర్వహించడం, వాటిలో పాల్గొనడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు.

ఘనంగా మధిర ఆర్యవైశ్య వన సమారాధన

మధిర, నవంబర్ 22 (జనంసాక్షి) :

మధిర వాసవి ఆర్యవైశ్య వన సమారాధన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మూరు అబ్బూరి వారి మామిడి తోటలో నిర్వహించిన ఆర్యవైశ్య వన సమారాధన వేడుకలు అత్యంత ఘనంగా, ఉత్సాహ భరితంగా జరిగాయి.సుమారు 3 వేల మందికి పైగా ఆర్యవైశ్య కుటుంబాల సభ్యులు, పెద్దలు, యువతీయువకులు పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు వ్యాపార, విద్య,వైద్య, సామాజిక,సేవా రంగాలతో పాటు అన్ని రంగాల్లోనూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కేవలం వ్యాపార రంగానికే పరిమితం కాకుండా రాజకీయ రంగంలోనూ చురుకైన పాత్ర పోషిస్తూ ఉన్నత పదవులను చేపట్టాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ఆర్యవైశ్యులు తమ వంతు సహకారం అందిస్తూ విద్య,సేవా కార్యక్రమాలు,సామాజిక అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఐక్యత, పరస్పర సహకారం ఎంతో అవసరమని,యువత విద్యతో పాటు రాజకీయ, సామాజిక రంగాల్లోనూ రాణిస్తూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి వన సమారాధనలు కుటుంబాల మధ్య ఆత్మీయఅనుబంధాలను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి. చిన్నారులు,యువత,పెద్దలు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు.ఒకేచోట వేలాది మంది ఆర్యవైశ్య కుటుంబాలు కలుసుకొని ఆత్మీయ పలకరింపులు,స్నేహసంబంధాలు పంచుకోవడంతో వన సమారాధన ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ



కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ కోదుమూరు కోటేశ్వరరావు,ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ గ్రంధి ప్రవీణ్ కుమార్, ఖమ్మం నగర అధ్యక్షులు గుమ్మడవెల్లి శ్రీనివాసరావు,ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి గోళ్ళరాధాకృష్ణమూర్తి, దారా మల్లికార్జునరావు,మధిర వన సమారాదన కమిటీ నిర్వాహకులు మిరియాల వెంకటరమణ గుప్తా,పల్లపోతు ప్రసాదరావు,చారుగుండ్ల నరసింహమూర్తి,దేవిశెట్టి రంగారావు, వేముల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

వైభవంగా శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం

వలిగొండ, నవంబర్ 22 (జనం సాక్షి)
మండలంలోని వెంకటాపురంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు, వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి కొత్తపల్లి వెంకటయ్య, చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమానికి హాజరైన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పట్టువస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన సత్రం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పిసాటి కుటుంబ సభ్యులు, నీలాద్రి, ఆరుద్ర హాస్పిటల్స్ (హయత్‌నగర్) ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, వెంకటాపురం సర్పంచ్ కర్నేకంటి కళమ్మ, గ్రామపెద్దలు, మండల నాయకులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





చౌటుప్పల్‌లో ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

చౌటుప్పల్ నవంబర్ 22(జనంసాక్షి)
మున్సిపల్ పరిధిలోని పద్మవంశి కాలనీలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రప్రథమంగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ వేడుకలో రేణుక ఎల్లమ్మ దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు గోషిక రాజేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, రొండి నర్సింహ, టంగుటూరి రాములు, ఎస్.ఏ. రహమాన్, ధర్మకర్తల మండలి సభ్యులు, బాల ఎల్లయ్య, భరత్ కుమార్, వనం పెంటయ్య, కోడి కృష్ణ తదితరులతో పాటు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిర్యాలగూడలో నవంబర్ 24న

బేస్‌బాల్ జిల్లా స్థాయి ఎంపికలు

జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు సెలక్షన్ ట్రయల్స్

మిర్యాలగూడ(జనంసాక్షి):
బేస్‌బాల్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 24న జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలబాలికలకు జిల్లా స్థాయి బేస్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరావతి సైదులు, ప్రధాన కార్యదర్శి చిర మల్లేష్ యాదవ్ తెలిపారు.మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో 2009 జనవరి 1 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని, సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు.పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా స్పోర్ట్స్ డ్రెస్‌లో హాజరుకావాలని సూచించారు. ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పదో తరగతి మెమో తీసుకురావాలని కోరారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు: 9705352638 సంప్రదించాలని కోరారు.

సర్వేల్ గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం

విద్యార్థులకు వైద్య పరీక్షలు - 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్.

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 22.(జనం సాక్షి):
సర్వేల్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.అదేవిధంగా పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉన్నత విద్య, భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన కోర్సులు, వివిధ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు విశిష్ట అతిథులు పాల్గొన్నారు. అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి పురుషోత్తం రెడ్డి, సీనియర్ సభ్యులు చిన్న రాజా, రాజశేఖర్ రెడ్డి, బద్రి వేణుగోపాల్, సతీష్, కరుణాసాగర్, అంబేద్కర్ దేగా, గంగాధర్ తదితరులు, వైద్యులు కోటిరెడ్డి, విజయానంద్, యాదగిరి, సతీష్ రెడ్డి విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. కామినేని మరియు సదురం దంత, కంటి వైద్య నిపుణులు కూడా ఈ శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వారి భవిష్యత్తుకు సరైన మార్గదర్శకత్వం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, ప్రస్తుత విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు.వైద్య శిబిరం, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు కట్ చేసిన దుండగులు

రాగి వైర్ల కోసం వచ్చి.. అల్యూమినియం వైర్లను వదిలేసి పరార్
నాయనవాణికుంట గ్రామ శివారులో ఘటన.. రైతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన



పెద్దవూర నవంబర్ 22 (జనంసాక్షి)
నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం నాయనవాణికుంట గ్రామ శివారులో గుర్తు తెలియని దుండగులు బీభత్సం సృష్టించారు. రాత్రి వేళల్లో పొలాల వద్ద ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వాటి వైర్లను కట్ చేశారు.ట్రాన్స్‌ఫార్మర్లలో విలువైన రాగి (కాపర్) వైర్లు ఉంటాయని ఆశించి వచ్చిన దొంగలు, వాటిని పగలగొట్టి కట్ చేసిన తర్వాత అందులో అల్యూమినియం వైర్లు ఉండటాన్ని గమనించారు. దీంతో నిరాశ చెందిన దుండగులు కట్ చేసిన వైర్లను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఉండటాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు:
బాధిత రైతులు వెంటనే స్థానిక పోలీసులకు, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, విద్యుత్ సిబ్బంది ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి వివరాలు సేకరించారు.

రైతులకు పోలీసుల సూచనలు:
ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో గ్రామ శివార్లలో, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



సూర్యాపేట(జనంసాక్షి):
క్రమశిక్షణ,బాధ్యతాయుతమైన దేశభక్తి గల పౌరులుగా యువతను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలకమైందని జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ వెంకటేశులు అన్నారు. ఆదివారం ఆ కళాశాలలో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎన్‌సీసీలో చేరడం వల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు.క్రమశిక్షణతో కూడిన, సేవాభావం కలిగిన యువతను తీర్చిదిద్దడం ఎన్‌సీసీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత సరైన విలువలతో ఎదిగినప్పుడే సమాజం,దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులు పరేడ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఆర్ శాస్త్రి,ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ నాగు నాయక్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలి

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీఓ ఉమాదేవి
- 18 నుంచి 59 ఏళ్ల లోపు వారికి రూ. 5 లక్షల బీమా రక్షణ
- గ్రామాలలో టాంటాం వేయించి అవగాహన కల్పించాలని సర్పంచ్‌లకు సూచన

పెద్దవూర నవంబర్ 22 (జనంసాక్షి)
మండల పరిధిలోని బట్టుగూడెం గ్రామంలో జరుగుతున్న ‘ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం’ ఎన్‌రోల్‌మెంట్ (నమోదు) ప్రక్రియను మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఉమాదేవి పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి, నమోదు వేగవంతం చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అర్హతలు, ప్రయోజనాలపై అవగాహన:
ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉమాదేవి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలో సంపాదించే ఒక కుటుంబ సభ్యుడు ఈ పథకంలో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గల వారు ఇందుకు అర్హులని తెలిపారు. ఈ పథకం కింద నమోదైన వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే, వారి నామినీలకు రూ. 5 లక్షల వరకు బీమా ఆర్థిక సాయం అందుతుందని వివరించారు.

గ్రామ ప్రజాప్రతినిధులు సహకరించాలి:
ప్రస్తుతం ప్రతి గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు, జీపీఓల ద్వారా



మొబైల్ యాప్ సహాయంతో ఈ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌లు తమ గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలందరికీ ఈ పథకంపై అవగాహన కల్పించాలని, తద్వారా నమోదు ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో బట్టుగూడెం సర్పంచ్ కుతాటి సంధ్యా, మురళి, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

185 మంది రైతులకు ఊరట..

○220 ఎకరాల పట్టా భూములు 22ఏ జాబితా నుంచి తొలగింపు

○సర్వే నంబర్ 1057లో రెవెన్యూ యంత్రాంగం తప్పిదం సవరణ..

○మైహోమ్ సిమెంట్స్‌కు చెందిన 40 ఎకరాలు నిషేధిత జాబితాలోకి

మేళ్లచెరువు జనంసాక్షి

మేళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1057లో 185 మంది రైతులకు చెందిన 220 ఎకరాల పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ సీసీఎల్ఏ ఆమోదంతో జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది డిసెంబరులో రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో ఏడాదిగా అధికారుల చుట్టూ తిరుగుతూ ఆందోళనలు, ఫిర్యాదులు చేసిన రైతులకు ఎట్టకేలకు ఊరట లభించింది. మేళ్లచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1057లో మొత్తం 631 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 170 ఎకరాల భూదాన్ భూమి, 18 ఎకరాల ప్రభుత్వ భూమి, 8 ఎకరాల దేవాదాయ శాఖ భూమి ఉన్నాయి. లెక్కల ప్రకారం 196 ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండాల్సి ఉండగా, అదనంగా 185 మంది రైతులకు చెందిన 416 ఎకరాల పట్టా భూములను సైతం 22ఏ జాబితాలో చేర్చడంతో వివాదం మొదలైంది. మరోవైపు మైహోమ్ సిమెంట్స్ ఆధీనంలో ఉన్నట్లు పేర్కొంటున్న సీలింగ్, అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని రైతులు ఆరోపించారు. దీంతో రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ జిల్లా కలెక్టర్‌తో పాటు హుజూర్‌నగర్ ఆర్డీవో, మేళ్లచెరువు తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి, మేళ్లచెరువు పోలీస్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తప్పుడు నివేదిక ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి తహసీల్దార్ రాజేందర్‌రెడ్డిని మేళ్లచెరువు నుంచి బదిలీ చేశారు. అనంతరం నిర్వహించిన విచారణలో 22ఏ జాబితాలో తప్పిదాలను గుర్తించి సవరణ చర్యలు చేపట్టారు. తాజాగా 185 మంది రైతులకు చెందిన 220 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించగా, మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమకు చెందిన 40 ఎకరాలను కొత్తగా 22ఏ జాబితాలో చేర్చారు. ఇదిలా ఉండగా, గత నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదే సర్వే నంబర్‌లోని 113 ఎకరాల భూదాన్ భూములను మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ కబ్జా చేసినట్లు అసెంబ్లీలో ప్రస్తావించిన విషయం తెలిసిందే. అయితే భూదాన్ భూముల స్వాధీనంపై ఇంకా చర్యలు తీసుకోలేదని రైతులు పేర్కొంటున్నారు. తమ పట్టా భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తూనే, సర్వే నంబర్ 1057లోని మొత్తం భూములకు సమగ్ర రీసర్వే నిర్వహించి భూభారతి చట్టం కింద సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి 20వ వార్షికోత్సవ వేడుకలు

మాడుగులపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి):

మండల పరిధిలోని కేశవపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి 20వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా గాయత్రి యజ్ఞం జరిగాయి ఈ సందర్భంగా గ్రామ భక్తులంతా కలిసి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లోకకల్యాణార్థం శాస్త్రోక్తంగా యజ్ఞం జరిపించారు పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం అయ్యప్ప, ఆంజనేయ స్వాములు భక్తులందరికీ ప్రత్యేకంగా భిక్ష (అన్నప్రసాద వితరణ) ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో గురుస్వామి వెంకటరెడ్డితో పాటు బూర రమేష్, నాగేందర్, రవి, టోనీ, శ్రవణ్ రెడ్డి, రాజు, మల్లయ్య, అశోక్, అక్షిత్, నవీన్, పవన్, రాకేష్, రోహిత్, మోహన్, సైదులు, గ్రామ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ప్రతాప్ రెడ్డి సేవలు మరువలేనివి

తిమ్మాపూర్ లో ప్రతాప్ రెడ్డి ప్రథమ సంస్మరణ సభ

బొమ్మలరామారం నవంబర్ 22 (జనంసాక్షి)

మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం మూగల కుటుంబ సభ్యులు మూగల ప్రతాప్ రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించి, స్మారక స్మృతి జీవిత పుస్తకం ఆవిష్కరించారు.అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతాప్ రెడ్డి గ్రామానికి చేసిన సేవలను గురించి కొనియాడారు. ప్రతాప్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో రామాలయం, గ్రామదేవతల దేవాలయాల నిర్మాణం జరిగిందని తెలిపారు. అలాగే పాఠశాల విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, పాఠశాల తరగతి గదుల నిర్మాణము ఇవే కాకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. పేదింటి ఆడపడుచుల వివాహాలకు తాళిబొట్టుడు కానుకలుగా అందించి వారికి ఆర్థికంగా అండగా నిలిచారని తెలిపారు. గ్రామానికి ఎన్నో సేవలందించిన మహోన్నత వ్యక్తిని కోల్పోవడం గ్రామ ప్రజల దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి ప్రతాప్ రెడ్డి తనయులు రఘునందన్ రెడ్డి, నాగిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తండ్రి చూపిన బాటలోనైనాడుస్తూ గ్రామానికి వాళ్లు కూడా వాళ్ళ వంతు సేవలను అందిస్తున్నారని వారి కుటుంబ సభ్యులందరికీ గ్రామ ప్రజలు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి , శతావధానులు మలుగ అంజయ్య యాదవ్ , ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలందరూ పాల్గొన్నారు.

మందుబాబుల ప్రాణాలతో చెలగాటం.. బీరు సీసాలో నలకలు!

మాడుగులపల్లి మండలంలోని మిత్రా వైన్స్ (G.S. No. 63) నిర్వాహకుల నిర్లక్ష్యం

ప్రశ్నించిన వినియోగదారుడిపై దురుసు ప్రవర్తన ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరింపులు

ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ కరువైందని స్థానికుల ఆగ్రహం

మాడుగులపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి):

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని మద్యాన్ని విక్రయిస్తున్న వైన్ షాప్ నిర్వాహకుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని జీఎస్ నెంబర్ 63 గల మిత్రా వైన్స్ లో నలకలు ఉన్న (కల్తీ/నాణ్యత లేని) బీరు సీసాను విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

అసలేం జరిగిందంటే

స్థానికంగా నివాసముండే ఒక వినియోగదారుడు ఇటీవల మాడుగులపల్లిలోని మిత్రా వైన్స్‌లో బీరు కొనుగోలు చేశారు సీసాను పరిశీలించగా అందులో స్పష్టంగా నలకలు (వ్యర్థాలు) కనిపించడంతో సదరు వినియోగదారుడు విస్తుపోయారు వెంటనే విషయాన్ని వైన్ షాప్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లి, కల్తీ బీరు ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు.

నిర్వాహకుల నిర్లక్ష్యపు సమాధానం

తప్పును సరిదిద్దుకోవాల్సిన షాపు నిర్వాహకులు అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించారు. ఆ బీరును మేమేమైనా తయారు చేశామా? కంపెనీ నుంచి అలాగే వచ్చింది, మేమేం చేయలేము అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. కనీసం డబ్బులు వాపసు ఇవ్వడానికి గానీ, మరో సీసా మార్చి ఇవ్వడానికి గానీ నిరాకరించారు.

విలేకరుల ఎదుటే బెదిరింపులు

బాధితుడు న్యాయం కోసం స్థానిక విలేకరులను ఆశ్రయించగా, మీడియా ప్రతినిధులు సదరు వైన్ షాప్ నిర్వాహకులను వివరణ కోరారు అయితే, విలేకరుల ఎదుటే నిర్వాహకులు మరింత దురుసుగా ప్రవర్తించారు నేను తయారు చేయలేదు, డబ్బులు వెనక్కి ఇవ్వను మీరేం చేసుకుంటారో చేసుకోండి అంటూ బాధితుడిని బెదిరింపు ధోరణిలో హెచ్చరించినట్లు తెలుస్తోంది.

అధికారుల స్పందన ఏదీ?

కల్తీ మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు, నాణ్యత విషయంలో మాత్రం చేతులెత్తేయడంపై మందుబాబులు మండిపడుతున్నారు కల్తీ మద్యం తాగి ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, మిత్రా వైన్స్‌పై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



రియల్ ఎస్టేట్ రంగంపై అవగాహన కలిగి ఉండాలి

అందరికీ అందుబాటులో మైరాన్ హోమ్స్ ప్రాజెక్ట్స్

సూర్యాపేట(జనంసాక్షి):

రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని మైరాన్ హోమ్స్ సీఈవో శ్యాంసుందర్ అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని తిరుమల గ్రాండ్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై, మైరాన్ హోమ్స్ నూతన ప్రాజెక్ట్స్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులు సైతం పెట్టుబడులు పెట్టే అవకాశం తమ సంస్థ కల్పిస్తోందని అన్నారు.మైరాన్ హోమ్స్ హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో వినూత్నమైన ఓపెన్ ప్లాట్లు, విల్లా ప్రాజెక్టులతో రియల్ ఎస్టేట్ రంగంలో దూసుకుపోతుందన్నారు. బాచుపల్లిలో మైరాన్ కమర్షియల్ మాల్, వికారాబాద్ లో మైరాన్స్ డైనాస్టీలో ఓపెన్ ప్లాట్లు, అధునాతన విల్లా ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు.ప్లాట్లు, విల్లాల కొనుగోలుతో పాటు నెలవారీ అద్దె ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు.రియల్ ఎస్టేట్ రంగంలో ఆసక్తి ఉన్నవారికి స్కూల్ ఆఫ్ రియల్ ఎస్టేట్ ద్వారా ఉచిత శిక్షణ,సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు.మార్కెటింగ్ రంగంలో ఆసక్తి ఉన్నవారు సంస్థతో భాగస్వాములుగా చేరి మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆనంద్, ట్రైనర్ పవన్ కుమార్, అడ్మిన్ టీమ్ జ్ఞానేశ్వర్, డాక్టర్ వడ్డేపల్లి రవికుమార్, వడ్డేపల్లి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరాన్ని ఎండబెడుతున్న ప్రజా ప్రభుత్వం

తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది

బియర్ఎస్ యువనేత షేక్ ఇస్మాయిల్

కొండమల్లేపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్రానికి జీవధారగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని దేవరకొండ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు షేక్ ఇస్మాయిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించబడిందని అలాంటి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షతో తెలంగాణ రైతుల ప్రయోజనాలను పక్కనపెడుతున్నారని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ నుంచి రోజుకు సుమారు 9 వేల క్యూసెక్కుల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారని ఒకవైపు తెలంగాణ రైతాంగం సాగునీటి కోసం ఎదురుచూస్తుంటే మరోవైపు మేడిగడ్డ బ్యారేజీ పరిసరాల్లో వేలాది లారీలతో ఇసుక దందా కొనసాగుతోందని కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రాజకీయ కక్షలు నిర్లక్ష్య ధోరణి విడనాడి తెలంగాణ నీటిని తెలంగాణ ప్రజల అవసరాలకు వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రాధాన్యత కావాలని ఇప్పటికైనా కాంగ్రెస్ పాలకులు కళ్లు తెరిచి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని అయన హితవు పలికారు. తెలంగాణ నీరు తెలంగాణ రైతులకే దక్కాలని రైతాంగ ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు అని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దుగ్యాల మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక..!

అండర్ -14 విభాగంలో మెరుగైన ప్రతిభ..

మెగావత్ అఖిల్‌కు ఉపాధ్యాయుల అభినందనల వెల్లువ

పి.ఏ.పల్లి,నవంబర్ 22(జనంసాక్షి):



పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దుగ్యాల తెలంగాణ మోడల్ స్కూల్ యందు తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి మెగావత్ అఖిల్ ఎంపికయ్యాడు.ఈ నెల 19వ తేదీన హాలియాలోని టైమ్ స్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 కబడ్డీ పోటీల్లో అఖిల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.ఈ నెల 23,24 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అఖిల్ పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ గరిడి విజయభాస్కర్ తెలిపారు.అఖిల్ చిన్న వయసులోనే క్రీడల్లో ప్రతిభ చాటుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.విద్యార్థి అఖిల్‌ను పాఠశాల ప్రిన్సిపల్ గరిడి విజయభాస్కర్,పీడీ మల్లేష్,శ్రీనయ్య,సరిత, పద్మావతి తదితర ఉపాధ్యాయులు అభినందించారు.రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అఖిల్ తన ప్రతిభను చాటుకొని విజయం సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అఖిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

చందంపేట నవంబర్ 22(జనం సాక్షి)
కుటుంబ సభ్యులతో కలిసి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేచందంపేట మండలం, దేవరచర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కేతావత్ కోఠి ? లక్ష్మానాయక్ దంపతుల కుమారుడి వివాహ వేడుక హైదరాబాద్‌లోని బొంగులూరు గేట్ సమీపంలోని వైఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. వివాహ బంధం జీవితంలో ఎంతో పవిత్రమైనదని, పరస్పర ప్రేమాభిమానాలు, నమ్మకం, గౌరవంతో నూతన దంపతులు జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఇరు కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ఎస్సీ అభివృద్ధి శాఖ వసతి గృహాలు

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ..

నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట

దేవరకొండ, నవంబర్ 22 (జనంసాక్షి):
దేవరకొండ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ముఖ గుర్తింపు ఆధారిత హాజరు నమోదు (ఈఖీయా) విధానాన్ని విజయ వంతంగా అమలు చేస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ దాసరి రుణాదేవి తెలిపారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షించడంతో పాటు వసతి గృహాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సాంకేతిక విధానం ద్వారా విద్యార్థుల హాజరు వివరాలను కచ్చితంగా నమోదు చేయడంతో పాటు వారి హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా హాస్టల్ నిర్వహణ చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలను సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థుల సంక్షేమానికి, నాణ్యమైన వసతి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ దాసరి రుణాదేవి వెల్లడించారు.

కౌన్సిలర్ యూనుస్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

బాధితుడికి న్యాయం చేయాలి

పోలీసులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలి

దేవరకొండ డీఎస్పీని కలిసిన యూనుస్ అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు

దేవరకొండ, నవంబర్ 22(జనం సాక్షి):
దేవరకొండ పట్టణంలోని ఇస్లాంపుర కాలనీలో ఆరో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ యూనుస్‌పై పారతో దాడి చేసి చేయి విరగ్గొట్టిన ఘటనపై ఆయన అభిమానులు, మిత్రులు, శ్రేయోభిలాషులు స్పందించారు. శనివారం వారంతా కలిసి దేవరకొండ డీఎస్పీని కలిసి, యూనుస్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మొహమ్మద్ ఉమేర్ ఖాసిం (రేషన్ డీలర్)పై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దాడికి సంబంధించిన వివరాలను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే ప్రజాప్రతినిధిపై పట్టపగలు దాడి జరగడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడికి ఎలాంటి అన్యాయం జరగకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, దాడికి పాల్పడిన వ్యక్తికి చట్టపరంగా తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పోలీసుల న్యాయబద్ధమైన చర్యల ద్వారా ప్రజల్లో పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం, భరోసా కలిగించాలని డీఎస్పీని కోరారు.

మిర్యాలగూడ సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి

మాడుగులపల్లి నవంబర్ 22 (జనంసాక్షి):



ఈ నెల 28న మిర్యాలగూడలో జరిగే శ్రీకృష్ణ సదర్ ఉత్సవాన్ని యాదవ సోదరులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు.ఆదివారం మాడుగులపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో స్థానిక సర్పంచ్ అర్రూరి నరేష్, పూసలపాడు ఉపసర్పంచ్ నడ్డి కృష్ణ యాదవ్‌లతో కలిసి ఆయన ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగుల అంజలి యాదవ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో తొలిసారిగా సదర్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇది యాదవుల సంస్కృతి, ఐక్యత మరియు ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సంఘం అధ్యక్షులు ఊరిబండి సైదులు యాదవ్, బారి కొండయ్య యాదవ్, లొడంగి యాదయ్య యాదవ్, మండలి దుర్గయ్య యాదవ్, రాచకుంట్ల దశరథ యాదవ్, చింతల సైదులు యాదవ్, ఊరిబండి గంగరాజు యాదవ్, నాగరాజు యాదవ్, పసుల రామలింగయ్య యాదవ్, తగుళ్ల రామకృష్ణ యాదవ్, సింగం పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అర్థ వెంకట్ రెడ్డి.. కిడ్నీ బాధిత కుటుంబానికి నిత్యావసరాల అందజేత

చౌటుప్పల్, నవంబర్ 22(జనం సాక్షి)
కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఫోటోగ్రాఫర్ మహేందర్ కుటుంబానికి యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అర్థ వెంకట్ రెడ్డి రూ. 15 వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ ఇటుకమల్ల మహేందర్ గత కొంతకాలంగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్నారు. ఆయన సతీమణి కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో, వారి ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అర్థ వెంకట్ రెడ్డి ఆదివారం మహేందర్ నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు.వారి దీనస్థితిని చూసి చలించిన వెంకట్ రెడ్డి, తక్షణ సాయంగా రూ. 15 వేల విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహేందర్ కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న ఈ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆపద సమయంలో తమకు చేయూత అందించిన అర్థ వెంకట్ రెడ్డికి మహేందర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రావుల స్వామి, మాజీ కౌన్సిలర్ బత్తుల విజయలక్ష్మి బాలరాజు గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల లింగస్వామి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఇప్ప వెంకటేశం, మున్సిపల్ అధికార ప్రతినిధి శామకూర యాదయ్య, సీనియర్ నాయకులు బాబు, 15వ వార్డు అధ్యక్షుడు ఉదయ్ సురేష్, ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడు బొజ్జ బుచ్చయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణతోనే సామాజిక న్యాయం సాధ్యం

- దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

- వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



బూర్గంపహాడ్ నవంబర్ 22 (జనంసాక్షి)
రాజ్యాంగ పరిరక్షణతో పాటు సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసినప్పుడే సమాజం లోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభిస్తాయని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేరాల శ్రీనివాస రావు అన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బూర్గం పహాడ్ మండలం మొరంపల్లి బంజారలో ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాల కరపత్రాలను పేరాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బర్ల వెంకటేశ్వర్లుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం మరింత బలమైన ప్రజా స్వామ్యంగా ఎదగాలంటే అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం తో పాటు విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేటు రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పేదరిక నిర్మూలన, పారదర్శక నియామక వ్యవస్థ, యువతకు గౌరవప్రదమైన ఉపాధి కల్పన ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేద్దాం.. ప్రతి యువకుడికి సమాన అవకాశాలు కల్పిద్దాం.. ప్రతి భారతీయుడికి గౌరవప్రదమైన భవిష్యత్తును నిర్మిద్దాం అనే నిర్మాణాత్మక ఆలోచనతో ముందుకు సాగాల్సిన అవసరం ఉంద న్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించినప్పుడే ప్రజాస్వామ్యం సంపూర్ణమవుతుందని, ఇదే భారత రాజ్యాంగం బోధిస్తున్న గొప్ప సందేశమని తెలిపారు. తెలంగాణలో దళితుల భూ పంపిణీ, అసైన్డ్ భూముల హక్కులు, భూ రికార్డుల సమస్యలు, భూముల ఆక్రమణలు, పట్టాల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కావాల్సిన కీలక అంశాలుగా ఉన్నాయని అన్నారు. భూదాన్, పోరంబోకు, ఇనాం తదితర భూములకు సంబంధించిన సమస్యలపై సమగ్ర అధ్యయనం చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 64 లక్షల జనాభా కలిగిన దళితుల కనీస అవసరాలు తీర్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు జరగాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం కింద రూ. 12 లక్షలు అందిస్తామని ఇచ్చిన హామీకి ప్రస్తుత బడ్జెట్‌లో కనీసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. దళితుల మౌలిక అభివృద్ధికి కృషి చేస్తామన్న ప్రభుత్వ హామీలు ఆచరణలో నీటి మూటలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం జరిగే 20వ వార్షికోత్సవాల్లో ప్రజలు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బర్ల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు అలవాల సీతారామరెడ్డి, సిద్ధారపు సుబ్బారెడ్డి, ఎండీ సాజిద్, కాటూరి రాము, అనుమల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ఘనంగా శ్రీకారం

జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించిన సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

బెథెస్త స్వస్థత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ర్యాలీ.. అనంతరం రక్తదాన శిబిరం



ఖమ్మం రూరల్, నవంబర్ 22(జనంసాక్షి)
ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో బెథెస్త స్వస్థత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ ప్రారంభ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన బైక్ ర్యాలీని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. మినిస్ట్రీస్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాల్లో కొనసాగి తిరిగి ప్రారంభ స్థలానికి చేరుకుంది.అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబురు దయాకర్‌రెడ్డి, క్రైస్తవ సంఘాల రాష్ట్ర నాయకుడు సింగం విల్సన్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ మోషే సొలోమోన్, పల్లవి సొలోమోన్, 28వ వార్డు సీపీఐ కౌన్సిలర్ దండి రంగారావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా కమ్మవారి వనసమారాధన

ఐకమత్యంతో ముందుకు సాగుదాం: డా కూనంనేని



కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 22 (జనంసాక్షి):
వనమంతా ఖనంతో కమ్మవారి కంఠాత్మకూర వనసమారాధన ఆదివారం పాల్వంచ కమ్మ సేవాసంఘం వారి ఆధ్వర్యంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల మామిడితోటలో ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకలో పెద్ద ఎత్తున హాజరైన మహిళలు, యువత, అన్ని వయసుల వారు వారిదైనందిన కార్యక్రమాలు ఆటవిడుపుగా ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. సంఘం అధ్యక్షుడు రావూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎం.ఎల్.ఎ, మాజీ ఎంపీ నామ, మాజీ మంత్రి పువ్వాడ డా కూనం నేని నరసింహారావు మాట్లాడుతూ కమ్మవా రందరూ ఒకరికొకరు సహకరించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమ సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, మాజీ జెడ్ పి చైర్మన్?కంబళ్ల చంద్రశేఖర్, మాజీ గిప్టంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం డి సి సి ప్రధాన కార్యదర్శి పువ్వాడ దుర్గాప్రసాద్, రావులపల్లి రాంప్రసాద్, తెళ్ల చిన్నయ్య, బొక్క సాంబ నాగేశ్వరరావు, చాగంటి కృష్ణమూర్తి, ఆళ్ల సుబ్బారావు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పలువురు చిన్నారులు తమ నృత్యాలతో ఆహూతులను అలరించారు.?ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి హరి సత్యనారాయణ, నాయకులు సూర్యదేవర రామ్మోహనరావు, చావా జగత్ మోహనరావు, కిట్టు మయూర సిరిపురపు లలిత?కుమారి, కొమ్మనెదురు జయలక్ష్మి, స్వప్నకుమారి, భవిత, సంఘ సభ్యులు సాయినేని కోటేశ్వరరావు, పాండురి నరసింహారావు, ఆదిలక్ష్మి నాగరాజు, రఘు, సంక్రాంతి రవి, కట్ట శ్రీనివాసులు, వీరభద్రం, చంద్రవరపు, పుట్టా నాగేశ్వరరావు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.





సత్యసాయి బాబా సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్

ఖమ్మం రూరల్, నవంబర్ 22:(జనంసాక్షి)
సత్య సాయి బాబా సందేశం ప్రతి ఒక్కరికి ఆదర్శమని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు . బాబా 101వ జయంతి సందర్భంగా ఎదులాపురం స్టేజీ వద్ద శ్రీ సత్యసాయి సేవా సమితుల ఆధ్వర్యంలో పేద చిన్నారులకు స్వెటర్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ చిన్నారులకు స్వెటర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి బాబా ప్రపంచానికి అందించిన "LOVE ALL, SERVE ALL – అందరినీ ప్రేమించండి, అందరికీ సేవ చేయండి" అనే సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. సత్యసాయి బాబా మానవ రూపంలో దైవస్వరూపమని, కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాలు కల్పించి విశేష సేవలందించారని కొనియాడారు.పేదలు, బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడమే సీపీఐ సిద్ధాంతమని, అలాగే సత్యసాయి బాబా ఆశయాలకు అనుగుణంగా తాము కూడా పేద ప్రజలకు సేవ చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పేద చిన్నారులకు స్వెటర్లు పంపిణీ చేసేందుకు ఎదులాపురం ప్రాంతాన్ని ఎంచుకున్న సేవా సమితి సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సేవా కార్యక్రమాలను అభినందించారు.చిన్నారులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే పౌరులుగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ డబ్బు సంపాదించే అవకాశం ఉన్నప్పటికీ, సమాజ సేవకు ముందుకు వచ్చేవారు కొందరేనని పేర్కొన్నారు. అలాంటి సేవాభావంతో పనిచేస్తున్న సత్యసాయి సేవా సమితి భవిష్యత్తులో చేపట్టే ప్రతి కార్యక్రమానికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని దండి సురేష్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ కౌన్సిలర్లు దండి శ్రీజాలోకేష్, కౌన్సిలర్ దండి రంగారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మెడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి

దొంగల బీభత్సం.. రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్!

కాపర్ వైర్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం..



బూర్గంపహాడ్ నవంబర్ 22 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం లో వరుస దొంగతనాలు రైతులను కలవరపెడుతున్నాయి. అర్ధరాత్రి వేళల్లో సంచరిస్తున్న దొంగలు ఇరవెండి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను అపహరిస్తుండగా, గత 15 రోజుల క్రితం ఇదే ప్రాంతంలో రైతు మోటారును సైతం చోరీ చేశారు. అంతకుముందు కూడా పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి కాపర్ వైర్లు ఎత్తుకెళ్లిన ఘటనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు రెడ్డిపాలెంలో సుమారు 10 మోటార్లకు సంబంధించిన వైర్లను దొంగిలించడం ఆందోళన కలిగిస్తోంది. కష్టపడి పంటలు పండించే రైతులకు దొంగతనాలు తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. కాపర్ వైర్లను అపహరించి పాత ఇనుప సామగ్రి దుకాణాల్లో విక్రయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వరుస ఘటనలతో రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లాలన్నా రైతులు భయపడే పరిస్థితి నెలకొంది. ఇరవెండి, రెడ్డిపాలెం ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, బూర్గంపాడు, అశ్వాపురం మండలాల్లో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ ముమ్మరం చేయాలని ఆయా ప్రాంతాల రైతులు, ప్రజలు కోరుతున్నారు. రైతుల కష్టార్జితాన్ని కొల్లగొడుతున్న దొంగల ముఠాకు పోలీసులు ఎప్పుడు అడ్డుకట్ట వేస్తారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

46వ డివిజన్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాపై విస్తృత ప్రచారం

అర్హులైన కుటుంబాలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ



ఖమ్మం, నవంబర్ 22 (జనంసాక్షి)

ప్రతి కుటుంబానికి భరోసా.. ఆర్థిక రక్షణ కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై 46వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పథకం వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు, యువ నాయకుడు తుమ్మల యుగంధర్ సూచనతో చేపట్టిన ఈ ప్రచారంలో నాయకులు ప్రజలకు పథకం ప్రయోజనాలను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడమే తమ లక్ష్యమని తెలిపారు. డిసెంబర్ 4 నుంచి 10 వరకు 46వ డివిజన్‌కు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కోసం అర్హులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు షేక్ రజ్జి, మాజీ కౌన్సిలర్ సింగం అంజయ్య, నాయకులు దయ్యాల నాగేశ్వరరావు, బాద్దే నాగేశ్వరరావు, ఎమ్మే రామకృష్ణ, చల్లా రమేష్, కన్నం రమేష్, గోనెల రవిశంకర్, మస్తాన్, షేక్ జానీ, చల్లా సైదులు, సద్దాం, కర్రె వినోద్, రాజపుత్ర హనుమాన్ సింగ్, కొక్కిరేణి వెంకటేశ్వర్లు, ఎరుకల ఆనంద్, పూజరి రాజు తదితర నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా భక్తులకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- పంచారామాలు, అన్నవరం, అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు..

- ప్రయాణికుల కోసం ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం

భద్రాచలం నవంబర్ 22 (జనంసాక్షి)

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం భద్రాచలం టీజీఎస్ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వివిధ పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పంచారామాలు, అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట, అన్నవరం, అరుణాచలం తదితర పుణ్యక్షేత్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో అధికారులు ప్రకటించారు. పంచారామాలకు ప్రత్యేక బస్సులు భద్రాచలం నుంచి పంచారామాల యాత్రకు నవంబర్ 15, 22, 29 తేదీల్లో రాత్రి 8 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరనున్నాయి. ఈ బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. పెద్దలకు రూ.2,150, పిల్లలకు రూ.1,100 టికెట్ ధరగా నిర్ణయించారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ నంబరు 98741గా ప్రకటించారు.

- అన్నవరం యాత్రకు ప్రత్యేక సర్వీసులు.

భద్రాచలం నుంచి అన్నవరం పుణ్యక్షేత్రానికి కూడా నవంబర్ 15, 22, 29 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ బస్సులు రాత్రి 8 గంటలకు బయలుదేరనున్నాయి. పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.260 టికెట్ ధరగా నిర్ణయించారు. అరుణాచలం, శబరిమలై యాత్రలకు కూడా భద్రాచలం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్తీక మాసంలో భక్తులు ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలు, రిజర్వేషన్ల కోసం 9959225960, 9553990399, 9959225987 నంబర్లను సంప్రదించవచ్చు. అలాగే టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని భద్రాచలం డిపో మేనేజర్ తెలిపారు.

సహజ ప్రసవంపై నర్సింగ్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 22 (జనంసాక్షి)

సహజ ప్రసవం ప్రాముఖ్యతపై మహిళలు, యువతులు మరియు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో శనివారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఖమ్మం జెడ్పీ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. ఈ ర్యాలీలో వివిధ నర్సింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు.సహజ ప్రసవంపై అవగాహన పెంపొందించడం, తల్లి-బిడ్డ ఆరోగ్యాన్ని పరిరక్షించడం మరియు అనవసరమైన సిజేరియన్ ప్రసవాలను తగ్గించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సహజ ప్రసవం తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనకరమని వివరించారు. వైద్యపరమైన అవసరం లేని సందర్భాల్లో అనవసరమైన సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు సహజ ప్రసవంపై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు.సహజ ప్రసవం ద్వారా తల్లి త్వరగా కోలుకోవడం, ఆసుపత్రిలో ఉండే సమయం తగ్గడం వంటి ప్రయోజనాలతో పాటు శిశువు ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని వివరించారు. ముఖ్యంగా యువతులు, గర్భిణీ స్త్రీలు ప్రసవ విధానాలపై సరైన అవగాహన కలిగి ఉండాలనివ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి పిచ్చయ్య మరియు డీఆర్ఎస్ కళాశాల నుంచి భాస్కర్ రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు.



ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా మిడ్‌వైఫ్ ఏ. స్వరూప వ్యవహరించగా, నర్సింగ్ ఆఫీసర్లు రవికుమార్, ఇసాక్ జాయ్, నగేష్ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు.అదేవిధంగా ర్యాలీలో కిన్నెర కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఏంజెల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సత్తుపల్లి మరియు గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు చెందిన ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతించి ప్రోత్సహించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, సంబంధిత విభాగాధిపతి డాక్టర్ యామిని మరియు నర్సింగ్ విభాగాధిపతి, నర్సింగ్ సూపరింటెండెంట్ రత్నకుమారికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అలాగే ప్రభుత్వ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, సత్తుపల్లి ప్రిన్సిపల్ కేబి జ్యోత్స్న, కిన్నెర కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ఏంజెల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఎంపీహెచ్‌డబ్ల్యూ విభాగాల ప్రిన్సిపల్స్‌కు విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసి విజయవంతం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మన తెలుగు సంస్కృతి విలక్షణమైనది

ఖమ్మం కార్పొరేషన్ నవంబర్ 22 (జనంసాక్షి)

దేశంలో భిన్న సంస్కృతులు ఆచారవ్యవహారాలు ఉండి భిన్నత్వంలో ఏకత్వాన్ని సాగిస్తుందని తెలంగాణ రాష్ట్ర వికాస వేదిక సాహిత్య సంస్థ ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ అన్నారు . ఆంధ్రప్రదేశ్ లో 2026 డిసెంబర్ 12,13 తేదీలలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నవ మల్లెతీగ సాహిత్య సంస్థ, ప్రభుత్వ యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించనున్న కార్యక్రమ గోడ పత్రికను తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్త ప్రజాకవి లెనిన్ శ్రీనివాస్ విజయవాడ కృష్ణా నది ప్రకాశం బ్యారేజ్ దగ్గర ఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సంస్థ అధ్యక్షుడు కలిమి శ్రీ , హుస్సేన్ ఖాన్ , డా గంటా విజయ్ కుమార్ లతో కలిసి కార్యక్రమం నిర్వహించారు . ఈ సభలలో సాహితీ ప్రముఖులు , అధికార యంత్రాంగం పాల్గొంటారని , పుస్తక ఆవిష్కరణలు, కవిసమ్మేళనాలు , సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని కలిమి శ్రీ తెలియజేశారు.



నీళ్లు ఖమ్మంకు.. సాగునీరు భద్రాద్రి రైతులకు కరువేనా?

మారెళ్లపాడు మోటార్లు వెంటనే ప్రారంభించాలి..

లేకుంటే రైతులతో కలిసి సీతారామ పంప్‌హౌస్ ముట్టడి: మర్రి మల్లారెడ్డి

అశ్వాపురం,నవంబర్ 22 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నీళ్లు, నిధులు, సహజ వనరులు ఇతర ప్రాంతాలకు. తరలిపోతున్నాయని, స్థానిక రైతులకు మాత్రం సాగునీటి విషయంలో అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ పార్టీ అశ్వాపురం మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకం మొదటి పంప్‌హౌస్ మోటార్లను ప్రారంభించి ఖమ్మం జిల్లా పంటలకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, అదే మండలంలోని మారెళ్లపాడు మోటార్లను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. మరమ్మతుల పేరుతో మోటార్లను నిలిపివేయడం వల్ల స్థానిక రైతులు రబీ సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

జిల్లా వనరులు.. అభివృద్ధి ప్రయోజనాలు ఎక్కడ?

జిల్లాలోని నీరు, ఇసుక, బొగ్గు, పరిశ్రమల ద్వారా రావాల్సిన ఆదాయం, డీఎంఎఫ్, సీఎస్ఆర్ నిధులు స్థానిక ప్రాంత అభివృద్ధికి పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, సాగునీటి విషయంలో భద్రాద్రి జిల్లాకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

మోటార్లు ఆన్ చేయకపోతే ముట్టడిస్తాం!

మారెళ్లపాడు మోటార్లను వెంటనే ప్రారంభించి తుమ్మలచెరువు ఆయకట్టుకు రబీ సాగునీరు అందించాలని మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు.



జిల్లా ప్రజాప్రతినిధులు స్థానిక రైతుల సమస్యపై స్పందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి సీతారామ పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.మా నీళ్లు.. మా నిధులు.. మా హక్కులు స్థానిక ప్రజలకే దక్కాలి అని ఆయన స్పష్టం చేశారు.



ఘనంగా వీరనారి ఝుల్కారీ బాయి జయంతి వేడుకలు

అశ్వాపురం,నవంబర్ 22 (జనంసాక్షి):

మాల సంఘాల జేఏసీ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్ ఆధ్వర్యంలో వేడుకలుమండల కేంద్రంలో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చెట్టి సురేష్ మాట్లాడుతూ వీరనారి ఝుల్కారి బాయి త్యాగం చిరస్మరణీయమని ఆమె చరిత్ర భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలియజేశారు.దళిత మహిళా ధైర్యసాహసాలకు ప్రతీక ఝుల్కారీ బాయి భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో వీరనారి ఝుల్కారీ బాయికి సముచిత స్థానం కల్పించాలని పలువురు సామాజిక నాయకులు కోరారు.1857 తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ రాణి లక్ష్మీబాయికి అండగా నిలిచి, బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కొన్న ధైర్యవంతురాలు ఝుల్కారీ బాయి అని కొనియాడారు.1857 స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో బ్రిటిష్ సైన్యం ఝాన్సీ కోటపై దాడి చేసినప్పుడు, రాణి లక్ష్మీబాయి వేషధారణలో శత్రువులను తప్పుదారి పట్టించి రాణి తప్పించుకునేందుకు సహకరించినట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని ఆమె ధైర్యం, తెగువ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో జూపెల్లి ధ్రువ, చెట్టి మనోజ్, కాల్వ విజయ్, రాజు, ఉండేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు క్రీడా ప్రతిభ

జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం

సూర్యాపేట(జనంసాక్షి):



ఒకవైపు పరిపాలనాపరమైన విధుల్లో నిత్యం బిజీగా ఉంటూనే, మరోవైపు క్రీడలపై ఉన్న మక్కువతో ఫుట్‌బాల్ ఆటలో రాణిస్తూ సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ రావు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.గోవా రాష్ట్రంలో జరుగుతున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ 2026-27 పోటీల్లో ఆయన తెలంగాణ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు.ఈ నెల 17 నుండి 25వ తేదీ వరకు గోవా వేదికగా ఈ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు.ఫుట్‌బాల్ క్రీడలో మంచి ప్రావీణ్యం ఉన్న వేణుమాధవ రావు, ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ సివిల్ సర్వీసెస్ జట్టుకు స్ట్రైకర్, మిడ్ ఫీల్డర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.రాష్ట్ర జట్టులో డిప్యూటీ కలెక్టర్ స్థాయి హోదాలో ఎంపికై మైదానంలో ఆడుతున్న ఏకైక ఆటగాడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.ఉద్యోగ బాధ్యతల ఒత్తిడిని అధిగమిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై, తెలంగాణ తరపున ఆడుతుండటం పట్ల పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది, క్రీడాకారులు సూర్యాపేట పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జాతీయ వేదికపై ప్రతిభ చాటుతున్న ఆర్డీవో వేణుమాధవ రావుకు పలువురు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల భరోసా..

ఇందిరమ్మ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వాపురం,నవంబర్ 22 (జనంసాక్షి):

అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొర్రెముచ్చు ఏకాంబరం అన్నారు. నెల్లిపాక బంజర, టేకులగుట్ట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు పథకంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఏకాంబరం మాట్లాడుతూ.. కుటుంబానికి ఆపద సమయంలో అండగా నిలిచేందుకు రూ.5 లక్షల బీమా భరోసా కల్పించే ఈ పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం వివరాలు తెలుసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు పథకంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గొర్రెముచ్చు ఏకాంబరం, కర్రీ భువన్ సంతోష్, జినుగు రాము, వీరమాచినేని రాజా, లంక సాయి తేజ, చిలకల ప్రవీణ్, రాచకొండ ప్రశాంత్, బొమ్మిడి పాపారావు, డేగల కృష్ణ, గోపగాని ఎల్లారావు, అజయ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరి రెడ్డి వర్ధంతి వేడుకలు

రామన్నపేట, నవంబర్ 22 (జనంసాక్షి):

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, రామన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణ కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ ఆధ్వర్యంలో కామ్రేడ్ గుర్రం యాదగిరి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని, సామాజిక న్యాయం కోసం ఆయన నిరంతరం కృషి చేశారని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటియుసి మండల కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, జిల్లా గీత పనివారాల సంఘం నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రచ్చ దయాకర్, సీనియర్ కామ్రేడ్ నాయకులు బాలగోని మల్లయ్య, ఊట్కూరు భగవంతు, జగన్నాథం పంతులు, వీరమల్ల ముత్తయ్య, గంగపురం యాదయ్య, పరుష సుదర్శన్, ఊట్కూరు శంకర్, ఊట్కూరు శ్రీను, జెల్ల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పు కార్యక్రమం విజయవంతం

సూర్యాపేట ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన బుల్లెట్ ట్రైన్ సాధన సమితి

సూర్యాపేట(జనంసాక్షి):

ఉద్యమాలకు పురిటిగడ్డ సూర్యాపేట అన్న నినాదాన్ని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వంట వార్పు కార్యక్రమం ద్వారా మరోసారి రుజువైందని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ సభ్యులు అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో జరిగిన వంటావార్పు సక్సెస్ కృతజ్ఞతాభినందన మీడియా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.పోరాట చరిత్ర కలిగిన సూర్యాపేట ప్రజల ఇంటి ముందుకు వచ్చిన బుల్లెట్ ట్రైన్ పక్కదోవ పట్టించే వారి భరతం పట్టేందుకు రోడ్లపైనే వంటలు చేసుకొని భారీ నిరసన తెలిపారని అన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధన కమిటీ ఇచ్చిన వంటావార్పు కార్యక్రమంను 100 సెంటర్లకు పైగా నిర్వహించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.గత నాలుగు నెలలుగా కొనసాగిన ఉద్యమంలో బుల్లెట్ ట్రైన్ ని పక్కదోవ పట్టకుండా ఆపగలిగామని అన్నారు.మొదట ప్రకటించిన ప్రకారం శంషాబాద్ నుండి వయా జాతీయ రహదారి 65కు సమాంతరంగా సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ కొనసాగేలా తీవ్రస్థాయిలో ఉద్యమాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.పట్టణ ప్రజలతో పాటు జిల్లాలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ నెల 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా 200మంది మహిళలతో మినీ ట్యాంక్ బండ్ వద్ద బుల్లెట్ ట్రైన్ కార్తీక మహా దీపం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్,ధర్మార్జున్, రమణాచారి, చలమల్ల నరసింహ,డేవిడ్ కుమార్, భూపతి రాములు, అనంతుల మధు, వెలుగు వనిత, సకినాల కృష్ణ, నేరెళ్ల మధు, బొమ్మగాని శ్రీనివాస్, సింహాద్రి, సట్టు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



